క్లుప్తంగా

హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసిన కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వచ్చిన హైకోర్టు రిజిస్ట్రార్ వై.లక్ష్మణరావును కలెక్టర్ పి.కోటేశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు కలెక్టర్ బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

ఫిబ్రవరి 18న మహా శివరాత్రి

కర్నూలు కల్చరల్: కర్నూలు జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 18వ తేదీన మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి గౌరవాధ్యక్షులు జి.రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక శాలమ్మ సత్రంలో సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. రాఘవరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 18న శివరాత్రి, 19న రథోత్సవ ఉత్సవాలు జరుగుతాయన్నారు.

బస్సుల నిర్వహణపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): బస్సుల నిర్వహణపై దృష్టి సారించి ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని జిల్లా ప్రజా రవాణ శాఖ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా ఆదేశించారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్‌లోని తన కార్యాలంలో ఆమె డిపోల మెకానికల్ ఇంజినీర్లు, ఎంఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా నడిపే బస్సులను ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. ప్రతి బస్సును ప్రత్యేకంగా పరిశీలించిన తరువాతే డిపో నుంచి బయటకు పంపించాలని చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు అర్బన్ సీడీపీఓ జి.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలో 11 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కర్నూలు నియోజకవర్గ పరిధిలో శ్రీరామనగర్-3, బంగారు పేట-2, 3, కొత్తపేట-6, స్లాటర్ హౌస్ (కబేళ)-2, వివి స్ట్రీట్-2, ఖడక్‌పుర-1, పాణ్యం నియోజకవర్గంలో వీకర్ సెక్షన్ కాలనీ-4, ఐహెచ్‌ఎస్‌డీపీ కాలనీ, ముజఫర్ నగర్-2, జొహరాపురం ఇందిరమ్మ కాలనీల్లో ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు నగరంలోని డీఐజీ బంగ్లా వద్ద ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ప్లాన్ ప్రకారం నిర్మాణాలు ఉండాలి

కర్నూలు (టౌన్): 'ప్లాన్ ప్రకారం నిర్మాణాలు ఉండాలి. వంద శాతం పక్కాగా ఉంటే సంబంధిత భవనాల మార్టిగేజ్‌లను రిలీజ్ చేయాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇన్‌చార్జ్ వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం కుడా పరిధిలో ఇటీవల పూర్తి చేసిన భవనాలకు సంబంధించి మార్టిగేజ్ రిలీజ్‌లను వైస్ చైర్మన్ పరిశీలించారు. వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో భవనాల కొలతలు వేయించారు. అలాగే కుడా అనుమతులు ఇచ్చిన విజయనగర్ కాలనీలో వెంచర్‌లను పరిశీలించారు. మార్టిగేజ్ రిలీజ్ చేసే సమయంలో డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండాలన్నారు. డీవియేషన్ ఉన్న వాటి విషయంలో ఆస్తి పన్ను, నీటి పన్నులను రెండింతలు వేస్తామన్నారు. కార్యక్రమంలో కుడా ప్లానింగ్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ డీటీసీపీ విజయభాస్కర్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసరు రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎడిఫై స్కూల్ వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.కొటేశ్వరరావు, ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి.కొటేశ్వరరావు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిలు హాజరై ప్రసంగించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే క్రమ శిక్షణను అలవాటు చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పుడూ కూడా ఇతరులతో పోల్చకుండా ప్రతి అంశంలో ప్రోత్సహించే విధంగా చూడాలన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, 18 పేజెస్, ధమాకా, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనో సార్స్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : 18 పేజెస్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనోసార్స్, ఏ జర్నీ టు కాశి, ధమాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ధమాకా, మైఖేల్ గ్యాంగ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : ఒక్కడు
రాజ్ : ధమాకా
శ్రీరామ : ఒక్కడు
విజయ : 18 పేజెస్

కేఎంసీలో అ'పూర్వ' సమ్మేళనం

50 ఏళ్ల తర్వాత ఇప్పుడే కలిశాం



కర్నూలు మెడికల్ కాలేజిలో మాది 1971 బ్యాచ్. నాతో పాటు చదువుకున్న డాక్టర్ మల్లీశ్వరిని 50 ఏళ్ల తర్వాత ఇప్పుడే చూస్తున్నా. సడన్‌గా గుర్తుపట్టలేకపోయాను. నాలుగు నెలలు ఇక్కడే ఉండి ఇక్కడ జన్మించే ప్రతి శిశువుకు ప్రతి ఒక్కరికి వెంటనే వినికిడి పరీక్ష చేయాలని ఉంది. ఈ మేరకు అవసరమైన డిజిటల్ మిషన్లు కూడా తెచ్చుకున్నాను.

–డాక్టర్ కృష్ణారెడ్డి, యుకే(మాంచెస్టర్)

చాలా ఆనందంగా ఉంది



ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైరై 12 ఏళ్లు దాటుతోంది. నాది కూడా 1971 బ్యాచ్. అప్పట్లో మా తోటి విద్యార్థులకు చదువు తప్ప ఇతర వ్యాపకాలు ఉండేవి కాదు. 50 ఏళ్ల తర్వాత స్నేహితులను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

–డాక్టర్ డీవీ. గిడ్డయ్య, కంటి వైద్యులు, కర్నూలు

కర్నూలు(హాస్పిటల్): వారంతా దేశ విదేశాల్లో ఎంతో ఉన్నతమైన స్థానంలో వైద్యవృత్తిని నిర్వర్తిస్తున్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. మిత్రులను ఆత్మీయంగా పలకరిస్తూ సంతోషంగా గడిపారు. ఆనాటి మధురస్మృతులను నెమరేసుకున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో రిటైర్డ్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణనాయక్ కుమారుడైన డాక్టర్ ఎం. జయంత్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో రోబోటిక్ సర్జరీ ప్రాముఖ్యత గురించి సీఎంఈలో వివరించారు.



మిత్రుల ఆత్మీయ పలకరింపులు

ఫోరెన్సిక్ విభాగం తొలి విద్యార్థిని



నాది 1969 బ్యాచ్. కర్నూలు మెడికల్ కాలేజి అంటే నాకు చాలా ప్రేమ. ఇక్కడ చదవడం నా అదృష్టం. అలాంటి టీచర్లు మాకు లభించడం పూర్వ జన్మ సుకృతం. అప్పట్లో ఫోరెన్సిక్ మెడిసిన్‌లో కూడా పీజీ మొదటి బ్యాచ్ విద్యార్థిని నేనే. వరల్డ్ ఫేమస్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి గారి తండ్రి డాక్టర్ భాస్కరరెడ్డి ప్రిన్సిపల్‌గా ఉండేవారు. ఆయన పులిలాంటి వారు. ఆయన వస్తున్నారంటే అంతా గప్‌చుప్‌గా ఉండేవాళ్లం.

–డాక్టర్ ఎస్వీకే. ప్రసాదరెడ్డి, ధర్మవరం



రోబోటిక్ సర్జరీ ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న డాక్టర్ ఎం. జయంత్

మత్స్యశాఖ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యశాఖ పథకాల ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మత్స్యశాఖ పథకాల అమలుపై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మత్స్యశాఖ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో 126 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా, లక్ష్యాన్ని మించి 200 యూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పొదుపు మహిళలు ముందుకు వస్తే జిల్లా కేంద్రంలో పెద్ద యూనిట్ నెలకొల్పి అన్ని రకాల చేపలను అందుబాటులో ఉంచుతామని, వాల్యుయాడెడ్ కింద చేపలతో వివిధ ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివిధ యూనిట్ల ఏర్పాటుకు పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయడంపై జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈవో రామాంజనేయులు, ఎల్‌డీఎం వెంకటనారాయణ, మెప్మా పీడీ నాగశివలీల, డీపీవో నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు లక్ష మంది హాజరవ్వాలి

- డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 9వ తేదీ నుంచి ఉపాధి హామీ పథకం పనులకు లక్ష మంది హాజరయ్యే విధంగా ఏపీడీ, ఏపీవో, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి పనులకు లేబర్‌ను పెంచడంపై విధి విధానాలను వివరించారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ ఆదేశం మేరకు జిల్లాలో సోమవారం నుంచి ప్రతి రోజు ఉపాధి పనులకు లక్ష మంది కూలీలు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి శిద్దలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తులను పరిరక్షించాలి



ఎమ్మెల్యే కాటసానిని భారీ మాలతో సత్కరిస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు, కార్పొరేటర్లు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: దేవాలయాల ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ఆలయ ధర్మకర్తల మండలిపై ఉందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు శ్రీ ఈశ్వర వీరభద్ర భీమేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆలయం వద్ద శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల నిధులను, ఆస్తులను దుర్వినియోగం చేయరాదన్నారు. దేవుడి సొమ్మును కాపాడాలన్నారు. దేవనగర్‌లో ఉన్న ఆలయం ఆస్తులను కబ్జాకానివ్వమన్నారు. దేవదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ కానీ కంచె కానీ వేయిస్తామని అన్నారు. హంద్రీలోని కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ధర్మ కర్తల మండలి చైర్మన్‌గా జె.వీరేంద్రకుమార్, సభ్యులుగా చిన్నశంకరప్ప, బి.ప్రభాకర్ రెడ్డి, తెలుగు కిషోర్, బలిజ శ్యామల, లక్ష్మిదేవమ్మ, వెంకటలక్ష్మి, కో ఆప్షన్ మెంబర్ రాఘవేంద్రలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రసన్న లక్ష్మి, కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగప్ప, ఈరన్న, శేఖర్‌రెడ్డి, జగదీష్, కల్లూరు ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్నాం

- టీడీపీ విమర్శలు చేయడం సిగ్గుచేటు
- పెన్షన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, మాజీ ఎంపీ

కర్నూలు (టౌన్): 'ప్రతి ఏటా పెన్షన్ మొత్తం పెంచుతున్నాం. అయినా తెలుగుదేశం పార్టీ విమర్శలు చేయడం సిగ్గుచేటని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. అనర్హులను తొలగించి అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఏ.క్యాంపులోని 17వ వార్డు కుడా కార్యాలయం ప్రాంగణంలో వైఎస్ఆర్ పెన్షన్ పెంపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నగరపాలక సంస్థ పరిధిలో 14వ వార్డు నుంచి 17వ వార్డు వరకు, అలాగే 22వ వార్డు నుంచి 25వ వార్డు వరకు కొత్తగా 1260 పెన్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నగర మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు అన్నారు. లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదామన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు బుట్టా రేణుకా మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కై వసం చేసుకుంటుందన్నారు. ఎక్కడ అవినీతి, పక్షపాతం లేకుండా అర్హత ఉన్న అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, 17వ వార్డు కార్పొరేటర్ పద్మాలతారెడ్డి, 14,15,16, 18 వార్డుల ఇన్‌చార్జ్‌లు మంజులత, వెంకటేశ్వరమ్మ, పప్పి, అక్బర్, చందు, సూర్యమోహన్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పర్ల సూర్యుడు, నాయకులు కేదార్‌నాథ్, సుహాసిని, టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మీ, సుధాకర్, శిరీషా, విజయ్ వర్ధన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎంఅండ్‌పీ ఈఈగా మురళీధర్‌బాబు
కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ మీటర్స్ అండ్ ప్రొటెక్షన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరుగా బి.మురళీధర్ బాబు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

స్టాక్ మార్కెట్‌పై నేడు అవగాహన సదస్సు
కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న హోటల్ సూరజ్ గ్రాండ్‌లో ఆదివారం స్టాక్ మార్కెట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫైనాన్షియల్ అడ్వైజర్, వెల్త్ కోచ్ కె.క్రిష్ణ కైలాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం
కర్నూలు కల్చరల్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
కర్నూలు సిటీ: జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా కమిటీ డీఈఓ డా.వి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ ఇటీవలే ఏర్పాటు అయ్యింది. ఈ కమిటీ శనివారం మర్యాదపూర్వకంగా డీఈఓను కలిశారు. ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ చైర్మన్ ఎస్.గోకారి తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతికి తరలిరండి
కర్నూలు(అర్బన్): ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వడ్డెర్లు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య కోరారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు చంద్రికమ్మ తదితరులు పాల్గొన్నారు.

13న ముగ్గుల పోటీలు
కర్నూలు కల్చరల్: రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి నగర కార్యవాహిక వసంతి లక్ష్మి తెలిపారు. పాల్గొనేవారు 9490081103(సుశీల), 80741 32365(పూరోదయ) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

11న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు
కర్నూలు (టౌన్): ఈ నెల 11వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-17, అండర్-21 విభాగాల్లో జిల్లా స్థాయి శాప్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా షూటింగ్‌బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు 9989982655 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

10న జెండావిష్కరణలు చేయాలి
కర్నూలు(సెంట్రల్): ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరుగనున్న అఖిల భారత సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భక్తి శ్రద్ధలతో ధనురాస్మ పూజలు
కర్నూలు కల్చరల్: నగరంలోని వైష్ణవాలయాలు, మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో శనివారం భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు నిర్వహించారు. గోదా గోకులంలో స్వామివారికి పూలంకి సేవ నిర్వహించారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో వెంకటేశ్వర స్వామి, గోదా దేవిలను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆముక్త మాల్యద పాసురాలను పారాయ ణం చేశారు. ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 7.30 గంటలకు కూడార్తై సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక
కర్నూలు(టౌన్): ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు రాజస్థాన్‌లోని డిగ్వానా పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన పూజిత, వరలక్ష్మి, మౌనికలు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సువర్ణ వెల్లడించారు. అదేవిధంగా వచ్చే నెలలో ఒడిస్సా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఎస్‌టీబీసీ కళాశాల విద్యార్థిని కె.కల్యాణి, ఆత్మకూరు డిగ్రీ కళాశాల విద్యార్థి రవి ఎంపికయ్యారు.

ఖోఖో పోటీలకు సిల్వర్‌జూబ్లీ విద్యార్థులు
కర్నూలు సిటీ: స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు బి.ప్రేమ్‌కుమార్, ఎస్.కె మహమ్మద్, బాలరాజు, ఎల్.మనోజ్‌కుమార్‌లు అంతర విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. శనివారం కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ ఆ విద్యార్థులను అభినందించారు.

రేపు 'ఖేలో ఇండియా' అవగాహన
కర్నూలు సిటీ: స్థానిక ఏక్యాంపులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో సోమవారం ఖేలో ఇండియా స్కూల్ ఫిట్‌నెస్ అసెస్‌మెంట్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కర్నూలు, ఆదోని డివిజన్లకు చెందిన పీఈటీ/పీడీలు హాజరుకావాలని డీఈఓ ఆఫీస్ అధికారులు సర్క్యులర్‌ను జారీ చేశారు.

మార్పు బాలకృష్ణమ్మకు నివాళి
కర్నూలు సిటీ: ఏపీటీఎఫ్ వ్యవస్థాపకులు, ప్రజాతంత్ర ఉద్యమాల నాయకుడు కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి కార్యక్రమం శనివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షతన తదితరులు మార్పు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్‌రావు పాల్గొన్నారు.

పింఛన్ కష్టాలు పోయాయి

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో మహిళ ఆర్.సుంకులమ్మ

కర్నూలు(రాజ్‌విహార్): 'మా జగనన్న సీఎం ఐనాక పింఛన్ కష్టాలు పోయినాయి. గతంలో ఆఫీసర్ల సుట్టూ తిరిగి తిరిగి పడిపోయేవాళ్లం. ఇప్పుడు ఒకటో తేదీన తెల్లారుజామున వలంటీర్ ఇంటి కాడికే వచ్చి సేతికిచ్చి పోతున్నారు. మూడేళ్లలో పింఛన్‌కు రూ.62వేలు, వైఎస్ఆర్ ఆసరా కింద రూ. 6,858, వైఎస్ఆర్ చేయూత కింద రూ.18,750 నా బ్యాంకులో ఏసినాడు. రూ.6 లక్షల ఇంటి స్థలం మొత్తం రూ.6,87,608 మంజూరు సేసినాడు' అంటూ ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ ఎదుట ఆనందాన్ని వ్యక్తం చేసింది ఆర్.సుంకులమ్మ. శనివారం ఎమ్మెల్యే 8వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద పడఖానలో వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వికలాంగులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో అభిమానం ఉందన్నారు. ఆయన సీఎం అయ్యాక తొలి సంతకం పింఛన్ల పెంపుపైనే పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్రార్, పార్టీ నాయకులు షాకీర్, ఫారూక్, యూసుఫ్, బాసిత్, శ్రీను, ముస్తాక్, ఇమ్రాన్ అలీ, హుసేన్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పాలనే పార్టీకి బలం

ప్రజాసంక్షేమ పాలనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమని ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం 8వ వార్డు దండిగేరి తెలుగుదేశం పార్టీకి చెందిన యువత ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు తాము ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఫిరోజ్, ఆయన మిత్రులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసమే పార్టీని పెట్టి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక

కర్నూలు(రాజ్‌విహార్)/కర్నూలు(అర్బన్): స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. పేద యువతీ, యువకులకు ఉచితంగా అందించిన కంప్యూటర్ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా శనివారం స్థానిక బుట్టా ఫౌండేషన్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుట్టా ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతిభావంతులకు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్స్ మేనేజరు చరిత, ఫస్ట్ స్టెప్ కంప్యూటర్ సెంటర్ అధినేత ఎస్.రాజశేఖర్, శిక్షణ సంస్థ మేనేజరు సుజాత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగాస్థానిక శ్రీమేధా జూనియర్ కళాశాలలో బీసీ విద్యార్థి సంఘం ముద్రించిన 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆవిష్కరించారు. సంఘం జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు మురళీమోహన్, రక్ష హాస్పిటల్ అధినేత నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సురభి నాటకోత్సవాలు

కర్నూలు కల్చరల్: సురభి కళాకారులచే ఆదివారం నుంచి మూడు రోజుల పాటు సురభి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయనతోపాటు సురభి కార్యనిర్వాహకులు సురభి శంకర్ మాట్లాడారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9 గంటలకు వరకు నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. మొదటి రోజు మాయా బజార్, 9న లవకుశ, 10న భక్త ప్రహ్లాద నాటకాల ప్రదర్శన ఉంటుంద న్నారు. కళాభిమాను లు, ప్రజలు హాజరై నాటకాలను వీక్షించాలన్నారు.